# నెరవేరనున్న దశాబ్దాల కల



- గిరిజన రైతులకు పోడు భూముల పట్టాలు
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చేతుల మీదుగా నేడు పంపిణీ
- రుద్రంగి మండలంలో 786మందికి లబ్ధి
- గిరిజన రైతుల హర్షం

రుద్రంగిలోని పోడు భూముల్లో సాగు చేసిన పత్తి

రాష్ట్ర ప్రభుత్వం గిరిజన రైతులకు పోడు భూముల పట్టాలు అందిస్తున్నది. ఈ క్రమంలో గురువారం రుద్రంగి మండల రైతులకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేయనున్నది. మండల వ్యాప్తంగా 786మందికి లబ్ధి చేకూరనుండగా, రైతుబంధు, రైతుబీమా కూడా వర్తించనున్నది. దశాబ్దాల కల బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నెరవేరనుండడంతో గిరిజన రైతాంగం సంతోషం వ్యక్తం చేస్తున్నది.

– రుద్రంగి, అక్టోబర్ 4

అటవీ భూములనే నమ్ముకొని వ్యవసాయం చేసుకుంటున్న గిరిజన రైతుల దశాబ్దాల కలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాకారం చేసింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గిరిజనులకు పోడు భూముల పట్టాలు అందిస్తున్నది. ఇప్పుడు వారికి అటవీ అధికారుల భయం లేదు. పంటలు పాడు చేస్తారన్న భీతి లేదు. కేసుల గోల లేదు. దశాబ్దాలుగా భయంభయంగానే పోడు చేసుకొని జీవిస్తున్న వారి జీవితాల్లో ఇప్పుడు వెలుగులు విరబూశాయి. నిర్భయంగా సాగు చేసుకొని అభివృద్ధి బాటలో ముందుకు సాగడమే ఇప్పుడు వారి ముందున్న లక్ష్యం. పోడు భూములు పంపిణీతో గిరిజనుల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపిన సీఎం కేసీఆర్‌కు గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు.

**నేడు మంత్రి చేతులమీదుగా పంపిణీ**

పోడు భూములకు పట్టాలు అందించనుండడంతో మండల వ్యాప్తంగా 786మందికి లబ్ధి చేకూరనున్నది. రుద్రంగిలో 28మందికి, మానాల, గిరిజనతండా గ్రామ పంచాయితీల్లో ఇప్పటి వరకు 759మందికి పోడు భూములకు పట్టాలు మంజూరయ్యాయి. ఈ క్రమంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి గురువారం గిరిజన రైతులకు పట్టాలు పంపిణీ చేయనున్నారు.



**ఆనందంగా ఉంది**

పోడు భూమిని దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నం. పోడు భూముల పట్టా కోసం ఎన్నో ఏండ్ల నుంచి ఎదురు చూస్తున్నాం. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మా కల నెరవేరింది. హక్కు పత్రాలు లేక చాలా ఇబ్బందిపడ్డాం. ఉమ్మడి మానాలలో ఇంకా చాలా మందికి పట్టాలు రావాలని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగానే అధికారులు గుర్తించి 759మందికి మంజూరు చేశారు. పట్టాలతోపాటు రైతుబంధు, రైతుబీమా వర్తింపచేయడం ఆనందంగా ఉంది. పోడు పట్టాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే

- దేగావత్ తిరుపతినాయక్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు (రుద్రంగి)



**గిరిజన బంధువు కేసీఆర్**

సీఎం కేసీఆర్ గిరిజనులకు ఆపద్బాంధవుడు. తండాలను గ్రామ పంచాయతీలు చేసి సుపరిపాలన అందించారు. గిరిజన రైతుల మేలు కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చా రు. రిజర్వేషన్లు సైతం 6 నుంచి 10శాతానికి పెంచారు. పోడు రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించారు. అర్హులందరికీ పట్టాలు ఇవ్వడంతోపాటు రైతుబంధు ఇవ్వడం సంతోషకరం. కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

- మాలోత్ రాందాస్‌నాయక్, బీఆర్‌ఎస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు (రుద్రంగి)



కాన్ఫరెన్స్ హాల్‌లో బతుకమ్మ చీరెలను ప్రదర్శిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

# మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం

- అన్ని విధాలుగా జిల్లా అభివృద్ధి
- జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- మహిళలకు బతుకమ్మ చీరెల పంపిణీ

కలెక్టరేట్, అక్టోబర్ 4: తెలంగాణ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తుందని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. తొమ్మిదన్నర ఏండ్లల్లో సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో మంత్రి కేటీఆర్ నాయకత్వంలో జిల్లా అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో 'మహిళలకు బతుకమ్మ చీరెల పంపిణీ' కార్యక్రమాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి జడ్పీ చైర్‌పర్సన్ లాంఛనంగా ప్రారంభించారు. మహిళలకు చీరెల పంపిణీ చేశారు. ముందస్తుగా బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ, కేసీఆర్ నేతృత్వంలో ప్రభుత్వం ఆడబిడ్డలకు కానుకగా బతుకమ్మ చీరెలను ఏటా పంపిణీ చేస్తుందని తెలిపారు. చీరెల పంపిణీతో సిరిసిల్లలోని పవర్‌లూం నేత కార్మికుల కుటుంబాలకు నిరంతరం ఉపాధి లభించి, ఆర్థికంగా బాగుపడ్డాయన్నారు. న్యూట్రిషన్, కేసీఆర్ కిట్, గృహలక్ష్మి వంటి అనేక కార్యక్రమాలను మహిళల పేరుతోనే ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. గడపగడపకూ సంక్షేమ పథకాలను అందిస్తూ పేదల సర్కారుగా పేరు పొందిందన్నారు. ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తే రానున్న రోజుల్లో దేశానికే నమూనాగా జిల్లా సర్వతోముఖాభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లాలోని మహిళా ప్రజాప్రతినిధులు అందరం బతుకమ్మ చీరలు ధరించి బతుకమ్మ పండుగ వేడుకల్లో పాల్గొంటామని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి, డీఆర్డీవో నక్క శ్రీనివాస్, చేనేత జౌళిశాఖ జిల్లా అధికారి సాగర్, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఆయాజ్, సెస్ డైరెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**ఆడబిడ్డల మోముల్లో ఆనందం**

బతుకమ్మ చీరెల పంపిణీతో సీఎం కేసీఆర్ తెలంగాణ ఆడబిడ్డల మోముల్లో ఆనందాన్ని నింపారు. అదే సమయంలో నేతన్న కార్మికుల కుటుంబాలకు ఆర్థిక భరోసాను కల్పించారు. ఒక అన్నగా, మేనమామగా సీఎం కేసీఆర్ తెలంగాణ మహిళలకు బతుకమ్మ చీరెలను ఏటా అందజేస్తున్నారు. బతుకమ్మ చీరెల ఆర్డర్లతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభం నుంచి బయటపడి, నేతన్నలు ఆత్మగౌరవంతో జీవనం సాగిస్తున్నారు. పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి మహిళలు అన్ని విధాలుగా అండగా నిలవాలి.

- జిందం కళ, మున్సిపల్ చైర్‌పర్సన్



వివిధ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీవో ఆనందర్‌కుమార్

# ఓటరు నమోదుపై అవగాహన

కలెక్టరేట్, అక్టోబర్ 4: సిరిసిల్ల నియోజకవర్గంలోని ఓటరు జాబితాపై ఆయా పార్టీల నేతలకు ఆర్డీవో ఆనంద్‌కుమార్ బుధవారం కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో పురుషుల ఓట్లు 1,17,872, స్త్రీల ఓట్లు 1,22,980 ఉండగా థర్డ్ జెండర్ ఓట్లు ఆరు ఉన్నాయన్నారు. రాబోయే ఎన్నికల్లో 287పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఇక్కడ ఆయా పార్టీల నేతలు శ్రీనివాస్, రంజిత్, ఐఎన్‌సీ కళ్యాణ్ చక్రవర్తి, ముస్తఫా, రాజన్న, దయాకర్‌రావు, కరుణాకర్ ఉన్నారు.

## లక్కీడ్రా స్కీం నిర్వాహకుడి అరెస్ట్

మేడిపల్లి, అక్టోబర్ 4: మోటర్ సైకిల్ లక్కీ డ్రా స్కీం నిర్వాహకుడు ప్రతాప్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చిరంజీవి బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లికి చెందిన గోనె ప్రతాప్ మోటర్ సైకిల్ లక్కీ డ్రా స్కీం కింద మేడిపల్లి, భీమారం, కథలాపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో రైతుల నుంచి డబ్బులు తీసుకొని మోసం చేశాడు. భీమారం మండల కేంద్రానికి చెందిన చెక్కపెల్లి రఘు, దాసరి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రతాప్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 4: రోడ్డు భద్రతా నిబంధనలను వాహనదారులు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ శశిధర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం గొల్లపల్లిలో విస్తృత తనిఖీలు చేపట్టి మాట్లాడారు. వాహనదారులు లైసెన్స్ లేకుండా, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ లేకుండా, మద్యం తాగి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను అందరూ పాటించాలని కోరారు. ఇక్కడ ఎస్ఐ రమాకాంత్, తదితరులు ఉన్నారు.

# ప్రగతి పథంలో ముస్తాబాద్

- ఎంపీపీ జనగామ శరత్‌రావు, జడ్పీటీసీ గుండం నర్సయ్య
- పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



తుర్కపల్లిలో సర్పంచ్ పద్మను అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు

ముస్తాబాద్, అక్టోబర్ 4: మంత్రి కేటీఆర్ సహకారంతో ముస్తాబాద్ మండలం ప్రగతి పథంలో పయనిస్తున్నదని ఎంపీపీ జనగామ శరత్‌రావు, జడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ కల్వకుంట్ల గోపాల్‌రావు, ఏఎంసీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్ పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్ సహకారంతో మంజూరైన పనులను బుధవారం వారు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ₹20లక్షలతో మొర్రాపూర్‌లో జీపీ భవనం, ₹8 లక్షలతో తెర్లుమద్దిలో మోడల్ అంగన్‌వాడీ భవనం, ₹33లక్షలతో ప్రగతి ప్రాంగణం, ₹20లక్షలతో పల్లె దవాఖాన, ₹1.77కోట్లతో నక్కవాగుపై వంతెన, సేవాలాల్‌తండాలో ₹16లక్షలతో నూతన జీపీ భవనం, తుర్కపల్లిలో ₹16 లక్షలతో జీపీ భవనం, ₹10 లక్షలతో సీసీరోడ్డు, తుర్కపల్లిలో కేసీఆర్ ప్రగతి ప్రాంగణం, ఆవునూర్‌లో ₹23.16లక్షలతో జీపీ భవనం, ₹33లక్షలతో ప్రగతి ప్రాంగణం, రామలక్ష్మణపల్లెలో ₹12.60లక్షలతో వైకుంఠధామం, ₹15లక్షలతో సీసీరోడ్లు, ₹10లక్షలతో కమ్యూనిటీహాల్‌ను సర్పంచులు భూక్యా దేవేందర్, కలకొండ కిషన్‌రావు, శ్రీనివాస్, కాశోళ్ల పద్మ, బద్ది కళ్యాణి, దమ్మ రవీందర్ రెడ్డితో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఇందుకు సహకారం అందించిన మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు కలకొండ కిషన్‌రావు, నాయకులు ఏనుగు విజయరామారావు, సర్వర్‌పాషా, మెర్గు యాదగిరిగౌడ్, జెల్ల వెంకటస్వామి, సాదుల్‌పాషా, దమ్మ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో రమాదేవి, పీఆర్ డీఈ, ఏఈ, తదితరులు ఉన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 4: తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బుధవారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు తంగళ్లపల్లి శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కళాజాత బృందం తమ ఆటపాటలతో ఆర్థిక అక్షరాస్యతపై వివరించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ బానోత్ దేవేందర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పొదుపు చేసే అలవాటు చేయాలని, కేంద్రం కల్పిస్తున్న సామాజిక భద్రత పథకాలైన ఏపీవై, పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవైలో చేరాలని సూచించారు. ఇక్కడ హెచ్ఎం భూక్యా రాజు, బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ యశ్వంత్‌రావు, బ్యాంకు మిత్ర చందన, టీచర్లు, విద్యార్థులు ఉన్నారు.